క్లుప్తంగా

అలరించిన బృందగాన పోటీలు



పాటల పోటీలో పాల్గొన్న విద్యార్థులు

నర్సీపట్నం : పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రతిభా పాటవ పోటీల్లో భాగంగా మంగళవారం నిర్వహించిన బృందగాన పోటీలు అలరించాయి. ఈ పోటీల్లో జిల్లాలోని పలు పాఠశాలల నుంచి 35 బృందాలు పాల్గొన్నాయి. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా నక్క వరలక్ష్మి, ఎస్తేరు రాణి, సంఘమిత్ర వ్యవహరించారు. పీఆర్టీయు అధ్యక్షుడు డి.గోపీనాథ్ మాట్లాడుతూ గత 18 ఏళ్లుగా బాలల దినోత్సవం వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు. వారిలో ఉన్న ప్రతిభను వెలికి తీయడం ద్వారా వారు అనేక పోటీల్లో విజయం సాధిస్తూ వ్యక్తిగతంగా ఎదుగుతున్నారని గోపీనాథ్ అన్నారు.

గ్రామసభలో 39 దరఖాస్తులు



మాట్లాడుతున్న తహసీల్దార్ వేణుగోపాల్

నాతవరం: మండలంలో కొడవటిపూడి అగ్రహారం గ్రామంలో మంగళవారం రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు, పంచాయతీలో రెవెన్యూ పరమైన సమస్యలు ఉంటే సభ దృష్టికి తీసుకువస్తే నిబంధనల ప్రకారం సరి చేస్తామని తహసీల్దార్ ఎ.వేణుగోపాల్ అన్నారు. రెవెన్యూ గ్రామసభలో 39 మంది రైతులు దరఖాస్తులు చేశారన్నారు.

కె.కోటపాడు : కె.కోటపాడు గ్రామంలో మంగళవారం రీ సర్వే గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టాదార్ పాస్ పుస్తకాల్లో పేర్లు నమోదులో తప్పులతో పాటు ఆధార్ నంబర్లు, భూ విస్తీర్ణం, సర్వే నంబర్లులో తప్పులను సరి చేయాలని 33 మంది అర్జీలను అందించారు. తహసీల్దార్ భాగ్యవతి, రీసర్వే డీటీ సూరి, మండల సర్వేయర్ రామచంద్రమూర్తి, వీఆర్వో జగదీష్ పాల్గొన్నారు.

రైతుల నుంచి వచ్చిన వినతులన్నీ పరిష్కరిస్తాం



కొరుప్రోలు గ్రామ సభలో రైతుల సమస్యలు తెలుసుకుంటున్న తహసీల్దార్ నాగమ్మ

రోలుగుంట: రైతుల భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూశాఖ నిర్వహిస్తున్న గ్రామ సభలు చక్కని వేదిక అని ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ శెట్టి నాగమ్మ కోరారు. మండలం కొరుప్రోలు గిరిజన గ్రామంలో మంగళవారం గ్రామ సభ నిర్వహించారు. రైతుల నుంచి వచ్చిన వినతులను ఆర్‌ఐ రామ్మూర్తి స్వీకరించారు. కోర్టు, ఆర్థిక సంబంధమైన వినతులు మినహా అన్ని అర్జీలను పరిశీలించి పరిష్కరించడం జరుగుతుందన్నారు. డిప్యూటీ తహసీల్దార్ శంకర్రావు, సర్వేయర్ తవిటినాయుడు పాల్గొన్నారు.

షిర్డీసాయి ఆలయానికి విరాళాలు

మాడుగుల రూరల్ : ఎం.కోడూరు గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ షిర్డీసాయి ఆలయం నిర్మాణానికి పలువురు దాతలు ముందుకు వస్తున్నారు. మాడుగుల గ్రామ సర్పంచ్, యడ్ల కళావతి, రూ.15000, ఉప సర్పంచ్ జవ్వాది వరహాలు రూ. 10,000 మంగళవారం ఎం.కోడూరు పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు పడాల అప్పలనాయుడుకు అందజేశారు. ఆలయ నిర్మాణానికి ఎం.కోడూరు సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు సంజీవిరావు, రమణబాబు, గ్రామస్తులుసహకారం అందిస్తున్నారన్నారు.

'కుళాయి పనులు అడ్డుకున్నారు..'

దేవరాపల్లి: కొత్తూరు ముత్యాలమ్మపాలెంలో తమ ఇళ్లకు మంచినీటి పైపులైన్ వేయకుండా అడ్డగించారని గ్రామానికి చెందిన పలువురు ఎంపీడీవో ఎం.వి.సువర్ణరాజుకు మంగళవారం ఫిర్యాదు చేశారు. కేఎం పాలెం సర్పంచ్ గంధం రామకృష్ణ అక్కడే ఉన్న ఎంపీపీ బుల్లిలక్ష్మి, జెడ్పీటీసీ కర్రి సత్యం, తహసీల్దార్ లక్ష్మీదేవికి సమస్యను వివరించారు. జల్‌జీవన్ పథకంలో ఇంటింటికి కుళాయి పనులు జరుగుతుండగా 15 ఇళ్లకు సంబంధించిన పైపులైన్ వేయకుండా గోవిరెడ్డి వీధి వాసులు అడ్డుకుంటున్నారని బాధితులు తెలిపారు. ఈ సమస్యను పరిష్కరించాలని ఎంపీపీ, జెడ్పీటీసీ అధికారులకు సూచించారు.

రైతుకు ఏదీ భరోసా..!

- సాగు పెట్టుబడుల సాయం కోసం ఎదురు చూపులు
- అన్నదాత సుఖీభవ పథకంగా రైతు భరోసా పథకం మార్పు
- రూ.20 వేల సాయమందిస్తామని ఎన్నికల ముందు హామీ
- అధికారంలోకి వచ్చి నాలుగు నెలలైనా హామీ నెరవేర్చని కూటమి ప్రభుత్వం
- పెరిగిన పెట్టుబడుల భారం... తెగుళ్ల నివారణకు అష్టకష్టాలు
- ఆందోళనలో అన్నదాతలు



వరి పొలంలో తెగుళ్ల నివారణ కోసం సస్యరక్షణ చేసుకుంటున్న రైతు

రోలుగుంట : ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలు దాటుతున్నా రైతులకు పెట్టుబడి సాయం ఛాయలే కనబడలేదు. దీంతో రైతులకు సాగు కోసం అప్పులు చేయాల్సి వస్తోంది. గత ప్రభుత్వం ఏడాదికి కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం కలిపి రైతులకు సాగు సాయం కింద రైతు భరోసా పథకం కింద రూ 13,500 అందించేది. వరినాట్లు, సాగు సమయం, కోతల సమయంలోను మూడు దఫాలుగా రైతులకు సాగు సాయం అందేది. అయితే ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం ఏడాదికి అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు రూ.20 వేలు చొప్పున అందిస్తానని హామీ ఇచ్చి అధికారంలో వచ్చి నాలుగు నెలలు దాటింది. కానీ నేటికీ ఆ హామీ అమలు చేయలేదు. దీంతో రైతులకు పాత కష్టాలు పునరావృతమై సాగు పెట్టుబడుల కోస వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సిన దుస్థితి నెలకొంది.

గతేడాది ఖరీఫ్ సీజన్‌లో సుమారుగా 1220 హెక్టార్ల పైబడిన విస్తీర్ణంలో వరి సాగు కాగా అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతు భరోసా కింద సుమారు 11 వేల పైబడిన రైతులు లబ్ధి పొందారు. ఈ ఖరీఫ్‌లో సాధారణ విస్తీర్ణం 1342 హెక్టార్లు కాగా పల్లం, మెరక భూముల్లో సుమారుగా 1800 హెక్టార్ల పైబడిన విస్తీర్ణంలో నాట్లు పడ్డాయి. కూటమి ప్రభుత్వం రైతు భరోసా పథకం పేరును అన్నదాత సుఖీభవగా పేరు మార్చింది. ఒక్కో రైతుకు ఏడాదికి రూ.20 వేలుగా పెంచి ఇస్తానన్న హామీ మాత్రం అలానే ఉంది. అయితే కేంద్ర ప్రభుత్వ ఎప్పటి మాదిరిగానే సకాలంలో రూ. 2000 ను రైతుల ఖాతాల్లో వేసింది. రైతుల పొలాలు ప్రస్తుతం ఈనిక దశలో ఉన్నాయి. ఈ ఏడాది కూలీ రేట్లు పెరిగాయి. తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు పంటలు ముంపునకు గురై కొంత మంది రైతులకు నష్టం వాటిల్లగా, భూముల్లో చేరిన నీటి నిల్వలతో పంటలను తెగుళ్లు ఆశించాయి. దీంతో సాగుకు, సస్య రక్షణ చర్యలకు పెట్టుబడి మరింత భారమైంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని వెంటనే పెట్టుబడుల సాయం అందించాలని రైతులు కోరుతున్నారు.

అప్పులు తప్పలేదు



ఎకరాన్నర విస్తీర్ణంలో వరి నాట్లు వేశాను. ఇప్పటికి వరి ఆకుపోత నుంచి ప్రస్తుతం పంట ఈనిక దశ వరకూ దమ్ము, నాట్లు, తెగుళ్ల నివారణకు సస్య రక్షణ, ఎరువుల వినియోగానికి రూ.35 వేలు పెట్టుబడి అయింది. కేంద్ర ప్రభుత్వం రూ.2 వేలు అందించింది. మిగిలినది అప్పు చేశాను. రాష్ట్ర ప్రభుత్వం హామీ నిలబెట్టుకోవాలి

– కోసూరి రాము, రైతు, కొండపాలెం

ప్రభుత్వం హామీ నిలబెట్టుకోలేదు



నేను అరెకరా విస్తీర్ణంలో వరి నాట్లు వేశాను. అధిక వర్షాల కారణంగా తెగుళ్లు అశించాయి. వ్యవసాయ అధికారుల సూచనలతో పురుగు మందుల సస్యరక్షణ చేపట్టాను. దీంతో అరెకరా సాగుకు పెట్టుబడి రూ.12 వేలు అయింది. కేంద్ర ప్రభుత్వ సాయం రూ.2 వేలు ఖాతాల్లో పడ్డాయి. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలో రూపాయి కూడా సాయం అందలేదు.

–లాలం సన్యాసయ్య, రైతు, రోలుగుంట

గత ప్రభుత్వం ఆదుకుంది...




కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు కావస్తున్నా రైతులకు ఖరీఫ్ సాగు పెట్టుబడికి ప్రకటించిన సాయం విడుదల చేయలేదు. గత ప్రభుత్వం (వైఎస్సార్‌సీపీ) హయాంలో రైతులకు సకాలంలో సాగు పెట్టుబడి సాయం అందించేది. కేంద్ర ప్రభుత్వం రూ.2వేలు అందించింది అభినందనీయం. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలి.

–మద్దు శివ, రైతు నాయకుడు, రోలుగుంట

గ్రామాల్లో దీపావళి పండగ శోభ



చోడవరం పట్టణంలో హైస్కూల్ గ్రౌండ్‌లో సందడిగా బాణసంచా దుకాణాలు



రకరకాల డిజైన్లతో ప్రమిద దీపాల వెలుగులు

చోడవరం : దీపావళి పండగ శోభతో గ్రామాలన్నీ సందడిగా మారాయి. అమావాస్య చీకట్లు పారద్రోలి జీవితాల్లో కొత్త వెలుగు నింపుకోవాలనే ఆకాంక్షతో దీపావళి పండగను ఘనంగా జరుపుకొనేందుకు ప్రజలంతా ఎంతో ఉత్సాహంతో ఒకరోజు ముందు నుంచే అన్ని ఏర్పాటు చేశారు. చోడవరం, మాడుగుల నియోజకవర్గాలకు వ్యాపార కేంద్రమైన చోడవరం పట్టణం పండగ శోభతో సందడి చోటు చేసుకుంది. ఒక పక్క బంగారం, వస్త్ర దుకాణాలు కొనుగోలు అమ్మకాలతో హడావిడిగా ఉండగా, అమావాస్య చీకట్లో వెలుగులు జిమ్మే బాణాసంచా దుకాణాలు మరీ కిటకిటలాడాయి. చోడవరం హైస్కూల్ గ్రౌండ్‌లో బాణాసంచా విక్రయ కేంద్రాలు ఒకే చోట ఏర్పాటు చేయడంతో ఆ ప్రాంతమంతా అమ్మకాలతో హడావిడి నెలకొంది. అయితే బాణాసంచా ధరలు మాత్రం ఆకాశాన్నంటడంతో పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలకు ఉన్నంతలోనే సంతృప్తి పడాల్సిన పరిస్థితి నెలకొంది. మట్టి ప్రమిదలు, కొవ్వొత్తుల అమ్మకాలు కూడా జోరుగా సాగాయి. పిల్లలు, యువకుల్లో దీపావళి సంబరం ముందే రావడంతో సోమవారం నుంచి బాణాసంచా అమ్మకాలు ప్రారంభించారు. ఇళ్లు, షాపింగ్‌లు, ఆలయాలు అన్నీ రంగురంగుల విద్యుత్ దీపాలంకరణతో కనువిందు చేశాయి. పండ్లు, పూలు, చెరకు గెడలు, పూజాసామాగ్రి దుకాణాలతో పట్టణంలోని మెయిన్‌రోడ్డు, చినబజార్ వీధి, గవరవరం రోడ్డు, పాతబస్టాండ్ జంక్షన్లు జనంతో రద్దీగా మారాయి. చోడవరం, గోవాడ,వెంకన్నపాలెం, జుత్తాడ, గవరవరం, నర్సాపురం తదితర గ్రామాల్లో దీపావళి సంబరాల కోసం ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

బ్యాంక్ ఖాతాదారులకు జన సురక్షా పథకాలు



గొండుపాలెంలో జన సురక్షా పథకాలను వివరిస్తున్న బ్యాంక్ సిబ్బంది

కె.కోటపాడు : బ్యాంక్‌లో ఖాతా కలిగి 18 ఏళ్ల పైబడిన వారు తప్పకుండా జన సురక్ష పథకాల్లో చేరాలని చౌడువాడ ఏపీజీవీబీ బ్యాంక్ ఫీల్ అధికారి బి.మల్లికార్జున్, అకౌంటెంట్ ఎం.చిట్టి వికాస్ అన్నారు. గొండుపాలెం గ్రామంలో మంగళవారం ఖాతాదారులకు జన సురక్షా పథకంలో అమలు చేస్తున్న పీఎం సురక్షా బీమా యోజన, జీవన్ జ్యోతి బీమా పథకాలపై అవగాహన కల్పించారు. ఏడాదికి రూ.20 ప్రీమియం నగదును చెల్లించిన ఖాతారులకు పీఎం సురక్షా బీమా యోజన పథకం వర్తించనున్నట్టు తెలిపారు. ఈ పథకం ద్వారా ఏడాది కాలంలో 18 నుంచి 70 ఏళ్ల వయస్సు గల వారు ప్రమాదాల బారిన పడి మరణించిన సమయాల్లో వారి కుటుంబాలకు బ్యాంక్ ద్వారా రూ.2 లక్షల నగదును అందించనున్నట్టు బి.మల్లికార్జున్, ఎం.చిట్టి వికాస్ తెలిపారు. పీఎం జీవన్ జ్యోతి బీమా యోజన పథకం ద్వారా ఏడాదికి రూ.436 చెల్లిస్తే 18 నుంచి 50 ఏళ్ల లోపు వారికి ప్రమాదవశాత్తూ లేదా సహజ మరణం వాటిల్లినా వారి కుటుంబ సభ్యులకు రూ.2 లక్షల నగదును ఇవ్వనున్నట్టు వీరు వివరించారు. ఈ పథకాల్లో తప్పనిసరిగా బ్యాంక్ ఖాతాదారులు చేరాలని ఖాతాదారులకు సూచించారు. వీటితో పాటు తక్కువ వడ్డీకే వ్యవసాయ రుణాలను రైతులకు బ్యాంక్ ద్వారా మంజూరు చేస్తున్నట్టు తెలిపారు. ఏడాది లోపు వ్యవసాయ రుణాలను చెల్లించడం ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే వడ్డీ రాయితీని పొందే పరిస్థితి ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో గొండుపాలెం ఏపీజీవీబీ సీఎస్‌పీ రామలక్ష్మి పాల్గొన్నారు.

నాణ్యత లోపిస్తే నిధుల రికవరీ



రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎస్‌ఈ వీరన్ననాయుడు

మాకవరపాలెం : రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత లేకుంటే నిధులు రికవరీ చేస్తామని పంచాయతీ రాజ్ శాఖ ఎస్‌ఈ వీరన్ననాయుడు స్పష్టం చేశారు. ఉపాధి హామీ నిధులతో మండలంలోని శెట్టిపాలెంలో చేపట్టిన రోడ్డు నిర్మాణ పనులను ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఈ రోడ్డు నాణ్యతను తనిఖీ చేశారు. నిబంధనలు మేరకు నిర్మాణాలు చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. నాణ్యత లోపిస్తే నిధులు రికవరీ తప్పదని తెలిపారు. అన్ని గ్రామాల్లోనూ పనులను వేగవంతం చేయాలన్నారు. ఆయన వెంట శెట్టిపాలెం సర్పంచ్ అల్లు రామునాయుడు ఉన్నారు.

గ్రామాభివృద్ధికి సహకరించాలి

మాడుగుల : సత్యవరం గ్రామ సచివాలయంలో మంగళవారం సచివాలయ సిబ్బందితో పంచాయతీ కార్యదర్శి కె. విశాలక్ష్మి సమావేశమయ్యారు. సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీకి సిద్ధం కావాలన్నారు. సచివాలయంలో సిబ్బంది తక్కువగా ఉండడం వల్ల ఆర్‌బీకే సిబ్బంది, అంగన్‌వాడీ వర్కర్లను పింఛను పంపిణీకి నియమించడం జరిగిందన్నారు. ఎవరి క్లస్టరులు వారు ఒకటో తేదీ 5 గంటలకే పంపిణీకి సిద్ధంగా ఉండాలన్నారు.

వ్యవసాయ సూచనలు పాటించాలి

గొలుగొండ : ప్రస్తుతం వరి పంటకు వస్తున్న తెగుళ్ల నివారణకు వ్యవసాయశాఖ సిబ్బంది సలహాలు, చూచనలు పాటించాలని వ్యవసాయ శాఖ అధికారి సుధారాణి తెలిపారు. ఏఎల్‌పురం గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. తెగుళ్ల నివారణకు తగు చూచనలు తీసుకోవాలని దీని వలన మంచి దిగుబడులు సాధించవచ్చునని తెలిపారు. ప్రస్తుతం వరి పంటపై తెగుళ్ల వస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ లోచల సుజాతతో పాటు రైతులు, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

40 మంది రోగులకు ఉచిత వైద్య పరీక్షలు

మాడుగుల రూరల్ : మండలంలో రెండు గ్రామాల్లో మంగళవారం ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. కింతలి పీహెచ్‌సీ పరిధిలో గల ఎల్. పొన్నవోలు శివారు లోవ గదబవీధి గ్రామంలో మంగళవారం కింతలి పీహెచ్‌సీ వైద్యాధికారి కె.మాలంనాయుడు వైద్య సేవలు అందించారు. 40 మంది రోగులను పరీక్షించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కె.జె.పురం పీహెచ్‌సీ పరిధిలో గల ఎం.గదబూరు గ్రామంలో పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రసాదుపాత్రుడు, 50 మందికి వైద్య సేవలు అందించారు. అయా గ్రామ ఎంఎల్ హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో పొలం పిలుస్తోంది

మాడుగుల: మండలంలో విజేపురం, జంపెన గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఖరీఫ్ వరి చేలు పరిశీలించిన వ్యవసాయాధికారి వాసుదేవరావు రైతులతో మాట్లాడారు. ప్రస్తుతం పొలాలకు ఆశించే తెగుళ్లు, వాటి నివారణ రైతులకు వివరించారు. పంటల బీమాకు సంబంధించి రైతులు అవగాహన చేసుకోవాలన్నారు. బ్యాంకులో రుణాలు తీసుకున్న రైతులకు బీమా ప్రీమియం బ్యాంకుల్లో తీసుకుంటారన్నారు. రుణాలు తీసుకోని రైతులు జాతీయ పంటల బీమా పోర్టల్లో వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతులు ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

కాగితలో రెవెన్యూ గ్రామ సభ

మాడుగుల : మండలంలో కాగిత గ్రామంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కె. రమాదేవి మాట్లాడారు. రీసర్వేలో జరిగిన తప్పిదాలపై అందజేసిన దరఖాస్తులు పరిశీలించి సరి చేస్తామన్నారు. రెతులు తమ సమస్యలపై అందజేసిన 11 దరఖాస్తులు ఫీల్డ్ వెరిఫికేషన్ నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు గ్రామస్తులు పాల్గొన్నారు.

అనుమతి లేకుండా బాణసంచా విక్రయాలు వద్దు

- సీఐ అప్పలరాజు

చోడవరం : దీపావళి పండగలో బాణాసంచాలు కాల్చేటప్పుడు అంతా జాగ్రత్తలు తీసుకోవాలని చోడవరం పోలీసు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అప్పలరాజు అన్నారు. అనుమతులు లేకుండా ఎక్కడా బాణాసంచా దుకాణాలు ఏర్పాటు చేసి విక్రయించరాదని హెచ్చరించారు. చోడవరం హైస్కూల్ గ్రౌండ్‌లో బాణాసంచా విక్రయ దుకాణాలు ఏర్పాటుకు అనుమతి ఇచ్చామన్నారు. అదేవిధంగా లైసెన్సు దుకాణాల్లో మాత్రమే బాణాసంచా తయారీ సామాగ్రి అమ్మకాలని బహిరంగ ప్రదేశాల్లో ఎక్కడా విక్రయించరాదన్నారు. ప్రజలంతా బాణాసంచా కాల్చేటప్పుడు జాగ్రత్తలు తీసుకొని దీపావళి పండగను ఆనందంగా జరుపుకోవాలని సీఐ అప్పలరాజు కోరారు.

చెట్టుపల్లి రెవెన్యూ సదస్సులో 107 అర్జీలు

చీడికాడ: మండలంలోని చెట్టుపల్లిలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో రైతుల నుంచి 107 అర్జీలు స్వీకరించినట్లు తహసీల్దార్ వై.వి.యస్.ప్రసాద్ తెలిపారు.వీటిలో 97 అర్జీలు కొలతల్లో తేడాలు ఉన్నట్లు వాటిని రీసర్వే చేయ్యాలని,10 ఇతర రెవెన్యూ సమస్యలపై అందాయన్నారు. వివిధ సమస్యలుపై రైతులు అందించిన వాటిని 15 రోజుల్లో పరిశీలించిన పరిష్కరిస్తామన్నారు.

మాడుగులకు 100 ఎల్ఈడీ బల్బులు

మాడుగుల : మాడుగుల పట్టణంలో 100 ఎల్ఈడీ బల్బులు వచ్చాయని సర్పంచ్ ఎడ్ల కళావతి తెలిపారు. రానున్న కార్తీక మాసం సందర్భంగా మాడుగులలో వెలసిన శివాలయాల వద్ద ఎల్ఈడీ బల్బులు వేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనాదు శ్రీనువాసరావు, జవ్వాది వరహాలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై కనీస సమాచారం ఏదీ?

- అధికారులను నిలదీసిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు
- వాడివేడిగా మండల పరిషత్ సర్వసభ్య సమావేశం



అధికారులను ప్రశ్నిస్తున్న సర్పంచ్‌లు బాబూరావు, చింతల, వేదికపై ఎంపీపీ బుల్లిలక్ష్మి, జెడ్పీటీసీ సత్యం

దేవరాపల్లి : మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం మంగళవారం వాడివేడిగా జరిగింది. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ చింతల బుల్లి లక్ష్మి అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో జెడ్పీటీసీ కర్రి సత్యం సహా పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ప్రజా సమస్యలపై గళమెత్తారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై గ్రామ ప్రథమ పౌరులైన సర్పంచ్‌లకు అధికారులు కనీస సమాచారం ఇవ్వడం లేదని బోయిలకింతాడ, ఎ.కొత్తపల్లి సర్పంచ్‌లు బూరె బాబురావు, చింతల సత్య వెంకటరమణ అధికారులను నిలదీశారు. సర్పంచ్‌లకు తెలియకుండా గోకులం షెడ్లకు లబ్ధిదారులను ఎలా ఎంపిక చేస్తారని వారు ప్రశ్నించారు. కొందరు అధికారులు ఉద్దేశ్య పూర్వకంగా పక్షపాత వైఖరితో వ్యవహరిస్తున్నారని, ఇది మంచి పద్ధతి కాదని హితవు పలికారు. వెరసి అధికారుల తీరుపై పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు అసంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు కనీస సమాచారం ఇవ్వడం లేదని ఎ.కొత్తపల్లి, బి.కింతాడ సర్పంచ్‌లు అధికారులను ప్రశ్నిస్తుండగా, దేవరాపల్లి ఎంపీటీసీ-2 మొల్లి కృష్ణమూర్తి అధికారుల తరపున వకల్తా పుచ్చుకొని మాట్లాడడంతో ఇరువురి మధ్య స్వల్ప వాగ్వాదం చోటు చేసుకుంది. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఇకపై సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు తప్పనిసరిగా సమాచారం అందిస్తామని ఎంపీడీవో ఎం.వి.సువర్ణరాజు సర్ది చెప్పడంతో సభ్యులు శాంతించారు. బోయిలకింతాడ, ఎ.కొత్తపల్లిలో ప్రభుత్వ పాఠశాలల ఆక్రమణ సమస్యలను పరిష్కరించాలని ఆయా గ్రామాల సర్పంచ్‌లు తహసీల్దార్‌ను కోరారు. అద్దె భవనాల్లో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రాలను ఖాళీగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల భవనాల్లోకి మార్పు చేయాలని సర్పంచ్ చింతల సత్య వెంకటరమణ కోరారు. ప్రైవేటు స్కూళ్లలో అధిక ఫీజులు వసూలు చేయడంతో పాటు అధిక సంఖ్యలో విద్యార్థులతో తగరతులు నిర్వహిస్తున్నారని దేవరాపల్లి ఎంపీటీసీ-2 మొల్లి కృష్ణమూర్తి ప్రస్తావించారు. అనంతరం ఎంపీపీ చింతల బుల్లి లక్ష్మి మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి మండలాభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో తహసీల్దార్ పి.లక్ష్మీదేవి, వైస్ ఎంపీపీ ఉగ్రాకుల గంగాభవానీ, ఎంపీటీసీలు పంచాడ సింహాచలంనాయుడు, వంటాకు పైడితల్లమ్మ, బండి గౌరమ్మ సర్పంచ్‌లు, చల్లా లక్ష్మి, గూడెపు రాము, టోకురి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఇసుక పేరుతో అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న తహసీల్దారు రమాదేవి

మాడుగుల రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక పాలసీని ప్రవేశపెట్టిన నేపథ్యంలో అందుకు అనుగుణంగా నిబంధనలు కూడా వర్తింప చేస్తుందని, ఆ నిబంధనలు అతిక్రమించి, ఇసుక రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోంటామని, స్థానిక తహసీల్దారు కె. రమాదేవి, పేర్కొన్నారు. మంగళవారం ఆమె సాక్షితో మాట్లాడారు. ఉచిత ఇసుక పాలసీ గురించి అమె వివరించారు. గ్రామాల్లో వ్యక్తిగత అవసరాలు కోసం ఇసుక తవ్వకాలు జరిపే చోట వాల్టా చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని, పోలీసుశాఖ సిబ్బంది, మరియు వీఆర్‌ఓలను ఆదేశించామన్నారు. ప్రజల అవసరాలు నిమిత్తం తక్కువ ధరకు ఎక్కువ ఇసుక అందించాలని నూతన ఇసుక పాలసీ ద్వారా ప్రభుత్వం సీనరేజి, జీఎస్టీ, రద్దు చేయడం జరిగిందని, తెలిపారు. స్థానిక అవసరాలకు ఇసుక ఉచితంగా తీసుకుని వెళ్లటకు ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు.

భూ అక్రమాలపై గ్రామస్తుల ఫిర్యాదు

మండలంలో లోవ పొన్నవోలు పంచాయతీ పరిధిలో గిరిజనులు సాగు చేసుకుంటున్న భూములను కొంతమంది దళారులు రియల్ ఎస్టేట్ వ్యాపారులకు తక్కువ ధరలకు విక్రయాలు సాగిస్తున్నారని గ్రామస్తులు మంగళవారం తహసీల్దార్ కె.రమాదేవికి ఫిర్యాదు చేశారు. గత 70 సంవత్సరాలుగా సాగులో ఉన్న డి.పట్టా భూములను క్రయ విక్రయాలు సాగిస్తున్నారని కె.చిలుకమ్మ, ఓంగ్రు రాజుబాబు, కొదమ శాంతి, కొదమ లక్ష్మణ తదితరులు తహసీల్దార్‌కు అందజేసిన ఫిర్యాదులో పేర్కొన్నారు. లోవ కృష్ణాపురం ప్రాంతంలో సర్వే నంబరు 81-84 లో 14 ఎకరాలకు సంబంధించిన భూముల క్రయ విక్రయాలు జరుగుతున్నాయని, వీటికి రిజిస్ట్రేషన్ జరగకుండా అపాలని కోరారు. బాధితులకు న్యాయం చేస్తామని తహసీల్దారు రమాదేవి హామీ ఇచ్చారు. వీరి వెంట పొన్నవోలు వార్డు సభ్యులు ఓంగ్రు చిన అప్పారావు, కోదమ రాము, కిముడు చినబ్బాయి, సాగిన బుజ్జి, అప్పారావు, అర్జున పాల్గొన్నారు.

కె.జగన్నాథపురంలో ఉచిత పశువైద్య శిబిరం



పాడి రైతులకు మినరల్ మిక్చర్ ప్యాకెట్‌లను అందిస్తున్న పశువైద్యాధికారులు నాయుడు, సౌజన్య

కె.కోటపాడు : పాడి రైతులు వర్షాకాలం సమయాల్లో పశు పోషణలో జాగ్రత్తలను పాటించాలని కొరువాడ పశువైద్యాధికారి సిహెచ్.వై.నాయుడు అన్నారు. మండలంలో కొరువాడ జగన్నాథపురంలో మంగళవారం ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చూడికట్టని 33 పశువులకు గర్భకోశ చికిత్సలను, 21 పశువులకు సాధారణ చికిత్సలతో పాటు, 25 పెయ్యిలకు నట్టల నివారణ మందులు వేశారు. 50 మంది రైతులకు ఉచితంగా మినరల్ మిక్చర్ ప్యాకెట్లు అందించారు. పశువైద్యాధికారి ఎస్.సౌజన్య, సర్పంచ్ ఎరుకమ్మ, పాల సంఘం అధ్యక్షుడు గోవింద, గోపాలమిత్ర గోవింద్ పాల్గొన్నారు.

అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే కేసులు



జంగాలపల్లిలో ఇసుక తవ్వకాల ప్రాంతాన్ని పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

మాకవరపాలెం: అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే కేసులు తప్పవని రెవెన్యూ అధికారులు హెచ్చరించారు. మండలంలోని జంగాలపల్లి, బీఎస్ పేట వద్ద సర్పానదిని ఆనుకుని ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో జంగాలపల్లికి చెందిన జిరాయితీ భూముల రైతులు సోమవారం కలెక్టర్‌కు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. ఈ ఇసుక తవ్వకాలపై పత్రికల్లోనూ కథనాలు రావడంతో రెవెన్యూ అధికారులు స్పందించారు. ఈ మేరకు మంగళవారం ఆర్‌ఐ జెట్టి, జంగాలపల్లి, జీ కోడూరు వీఆర్వోలు సూర్యనారాయణ, కమల ఇసుక తవ్వకాలు జరిగిన ప్రాంతాలను పరిశీలించారు. అక్కడ ఇసుక తరలింపునకు అనుమతులు ఇవ్వలేదన్నారు. ఇన్‌చార్జ్ తహసీల్దార్ రామారావు ఆదేశాల మేరకు ఇసుక తరలించకుండా ఉండేలా వీఆర్‌ఏలను కాపలాగా ఉంచామని ఆర్‌ఐ తెలిపారు.

సారా తయారు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు

నాతవరం : సారా తయారీ చేసినా, విక్రయాలు చేసిన కఠిన చర్యలు ఉంటాయని నాతవరం ఎస్‌ఐ సిహెచ్.భీమరాజు అన్నారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ సారా తయారీ చేసే ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ఇటీవల పలు ప్రాంతాల్లో మాకు అందిన సమాచారంతో దాడులు చేసి పలువురిని పట్టుకుని కేసులు నమోదు చేశామన్నారు. అలాగే దీపావళి పండగ సందర్భంగా అనుమతులు లేకుండా సామాగ్రి విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు.